అగ్రి'కల్చర్' మారింది

- పెరిగిన యాంత్రీకరణ
- కనుమరుగవుతున్న కాడెద్దుల సేద్యం
- యంత్రాలతో సాగుకు రైతుల ప్రాధాన్యత
- కూలీల కొరత, పశువుల మేతకు ఇబ్బందులు
- దుక్కి పశువుల పెంపకంపై తగ్గుతున్న ఆసక్తి
- జిల్లాలో దుక్కిదున్నే పశువులు 38,790

వ్యవసాయంలో ఎద్దుల పాత్ర ఎంతో కీలకమైనది. అలాంటిది ప్రస్తుతం వాటి అవసరం లేకుండానే సాగు పనులు జరుగుతున్నాయి. దిగుబడులు ఇంటికొస్తున్నాయి. ఒకప్పుడు ఎద్దులు లేకుండా పొలాల్లో కనీసం చిన్న పని కూడా చేపట్టలేని పరిస్థితి. ముందుగా కాడెద్దులకు పూజ చేసిన తరువాతే పనులు ప్రారంభించేవారు. నేడు మాత్రం..సాంకేతిక విప్లవం కారణంగా.. ట్రాకర్లతో దుక్కిదున్నడం, విత్తనం వేయడం, డ్రమ్మర్లతో నాట్లు, యంత్రాలతో కలుపు తొలగించడం, కోతలు, నూర్పిళ్లు చేస్తున్నారు. అలాగే మేతకు ఇబ్బందులు, పోషణ భారంగా మారడంతో ఎద్దులు రైతన్న నుంచి దూరమయ్యాయి.

నంద్యాల: వ్యవసాయ పనులు చేయాలంటే రైతు ఇంట దుక్కి ఎద్దులు ఉండాల్సిందే. వాటి సాయంతో ఎన్ని ఎకరాలైనా దున్నేసి పంటలను పండించేవారు. అదంతా గతం. ఇప్పుడు కల్చర్ మారింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఎక్కువ మంది రైతులు యంత్రాలతోనే వ్యవసాయం చేస్తున్నారు. వాస్తవంగా పాడి పంట రైతులకు రెండు కళ్లలాంటివి. ఇంటి ముంగిట పశువుల అరపులు వినిపిస్తే ఆ ఇంట సిరులు ఉన్నట్లు భావించే వారు. ఎవరి కల్లంలో ఎక్కువ పశువులు ఉంటే ఆ రైతును భూస్వామిగా గుర్తించేవారు. ఆ పరిస్థితి నేడు కనిపించడం లేదు. దుక్కి, పాడి పశువులు ఉండాల్సిన చోట ట్రాక్టర్లు, ఇతర యంత్రాలు దర్శనమిస్తున్నాయి.

రైతుల అనాసక్తి..

దుక్కి పశువుల పెంపకంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. యంత్రాలతో వ్యవసాయ పనులు చేస్తే సమయం కలిసి రావడంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని భావిస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో అతి కొద్ది మంది మాత్రమే ఇప్పటికీ దుక్కి పశువులను పోషిస్తున్నారు. చాలా తక్కువ పొలాల్లో మాత్రమే కాడెద్దుల సేద్యం కనిపిస్తోంది. నంద్యాల జిల్లాలో మొత్తం పశువులు 3,48,500 ఉండగా.. దక్కిదున్నే పశువులు 38,790 మాత్రమే ఉన్నాయి.

యాంత్రీకరణ దిశగా..

యాంత్రీకరణ పుణ్యమా అని వ్యవసాయ రంగంలో దుక్కి పశువుల వినియోగం తగ్గిపోయింది. ఈ క్రమంలో పొలం పనుల్లో యంత్రాల వినియోగం పెరిగింది. పశువులను దుక్కిదున్ని విత్తనాలు వేసుకోవడం, దమ్ము చేసి నాట్లు వేసే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. దుక్కి నుంచి పంటను ఇంటికి చేర్చే వరకు అన్ని స్థాయిల్లో యంత్రాలు అందుబాటులో ఉండటంతో పశువులను పెంచుకోవడం దండగా అనే ఆలోచన రైతుల్లో పెరిగిపోయింది.

సమయం ఆదా..

ఎకర పొలం పశువులతో దున్నాలంటే రైతుకు రెండు రోజులు పడుతుంది. అదే ట్రాక్టర్‌తో అయితే గంటలో పూర్తి చేయవచ్చు. దీంతో చాలా మంది సొంతంగా ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలను సమకూర్చుకుంటుండగా, ఆర్థిక స్థోమత లేని వారు అద్దెకు తెచ్చుకొని పనులు పూర్తి చేసుకుంటున్నారు. తక్కువ శ్రమ, సమయం, పెట్టుబడి అదా అవడంతో యంత్రాల పట్ల మక్కువ చూపుతున్నారు.


దొర్నిపాడులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

మేతకు ఇబ్బందులు..

పశువుల మేత పెంచేందుకు గతంలో గ్రామాల్లో ఖాళీ స్థలాలు ఉండేవి. నేడు అలాంటి పరిస్థితి లేదు. రోడ్ల పక్క స్థలాలు, పంట పొలాలు సైతం ప్లాట్లుగా మారిపోతున్నాయి. దీంతో పశువుల మేత లభ్యం కాని పరిస్థితి. దీంతో వీటి పోషణకు ఇబ్బందులు తలెత్తుతుండటంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. పంట కోత, నూర్పిళ్లకు సైతం యంత్రాల వినియోగం పెరగడంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుంది. వాస్తవంగా పశువులకు ఏడాది వరకు ఎండుగడ్డి అవసరం ఉంటుంది. మేత పెట్టడం, వాటి సేవల్లో రోజులో కొంత సమయం కేటాయించాల్సి ఉండటంతో ప్రస్తుతం ఆ స్థాయిలో శ్రమించే పరిస్థితి కనిపించడం లేదు.


యంత్రంతో వరి పంటను కోస్తున్న దృశ్యం


ఎద్దులతో వ్యవసాయ పనులు చేస్తున్న రైతు (ఫైల్)

ఖర్చు అధికమవుతుంది



గతంలో కూలీలు తక్కువ ఖర్చుకే దొరికేవారు. నేడు ఎక్కువ కూలి డిమాండ్ చేస్తున్నారు. అలాగే వ్యవసాయ పనులకు వచ్చే వారు పూర్తిగా తగ్గిపోయారు. రైతుల పిల్లలు, చదువులు, ఉద్యోగాలు అంటూ పట్టణాలకు వెళ్తున్నారు. పశువులను పెంచేందుకు, వాటికి మేత, కుడితి పెట్టి వాటితో పొలం పనులు చేయడానికి ప్రస్తుతం కూలీలు దొరకడం లేదు. దీంతో యంత్రాలతోనే వ్యవసాయ పనులు చేసుకోవాల్సి వస్తుంది.

– చిట్టిపు ప్రభాకర్‌రెడ్డి, దీబగుంట్ల, గోస్పాడు మండలం

పశువుల పోషణ తగ్గింది



గతంలో పొలం ఉన్న రైతుల ఇంట పశువుల పెంపకం ఎక్కువగా ఉండేది. రోజులు మారుతుండటంతో రైతుల పరిస్థితులు మారాయి. ప్రస్తుతం పాడి అవసరం కోసం మాత్రమే పశువులను పెంచుతున్నారు. పశువులతో పొలాల్లో పని చేయాలంటే భారమవుతుండటంతో రైతులు ఎక్కువగా యంత్రాలపై ఆధారపడుతున్నారు. యంత్రాల రాకతో పశువుల పెంపకం తగ్గింది.

– వెంకటసుబ్బారెడ్డి, పశుసంవర్థక శాఖ ఏడీ, నంద్యాల

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం


రెడ్‌క్రాస్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పురస్కరించుకొని శైవ క్షేత్రాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు వైద్యసేవలందించిన రెడ్‌క్రాస్ సభ్యుల సేవలు అభినందనీయమని డీఆర్‌ఓ పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో 85మంది సభ్యులకు, 29 ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు డీఆర్‌ఓ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, సెక్రటరీ మమతారెడ్డి మాట్లాడుతూ ఆరు రోజుల పాటు శ్రీశైలం, పెచ్చెరువు, కైలాసద్వారం, మహానంది, యాగంటి, ఓంకారం, భోగేశ్వరం, తదితర శైవ క్షేత్రాల్లో వైద్యసేవలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మునీర్, సద్దాం, బాబు, ఉపాధ్యక్షుడు మారుతి, కుమార్ పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

శిరివెళ్ల: ఉగాదికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి సమస్యపై సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఉగాది నాటికి 87 పక్కా ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారని చెప్పారు. ఇప్పటి వరకు 10 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 77 ఇళ్లు 90 శాతం నిర్మాణం పూర్తయ్యాయని పేర్కొన్నారు. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రక్షిత మంచి నీటి పథకాలను శుభ్రం చేసిన తేదీలను విధిగా ట్యాంకుల వద్ద నోటీస్ బోర్డులో రాయాలని సూచించారు. క్లోరినేషన్‌పై అవగాహన పెంచుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషా, ఈఓ ఆర్డీ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు


దేవతామూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో సీత, లక్ష్మణ, హనుమంత, కోదండ రామస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం వేద పండితులు ఆయా దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం, వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు, ధాన్యాధి, శయ్యాదివాసం వంటివి నిర్వహించారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠ, ఎదుదల బండలాగుడు పోటీలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఇంటింటికీ కుళాయి


బి.నాగిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో సాగుతున్న పైప్‌లైన్ పనులు

రుద్రవరం: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు కాలనీ వాసులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని విన్నవించారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, సర్పంచ్ దేవదానంను ఆదేశించారు. దీంతో వారు ఎన్నికల కోడ్‌కు ముందే పైపులు సిద్ధం చేశారు. గురువారం పనులు చేపట్టారు. గ్రామం నుంచి కాలనీ వరకు దాదాపు 350 మీటర్ల వరకు కొత్తగా పైప్ లైన్ వేయించారు. పనులు పూర్తి కాగానే ప్రతి ఇంటికీ కుళాయి వేస్తామని చెప్పారు.

లింగ వివక్ష విడనాడాలి

గోస్పాడు: లింగ వివక్ష విడనాడాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక కస్తూర్బాలో ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగజ్జననీ మాతకు శ్రీచక్రార్చన



అమ్మవారి ఉత్సవమూర్తికి శ్రీచక్రార్చన నిర్వహిస్తున్న దృశ్యం, కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగ్గనన్నీనగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం అమ్మవారికి నవా వరణ పూజా విధితో శ్రీచక్రార్చన కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తికి నవావరణ పూజా విధితో శ్రీచక్రార్చన కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ పండితులు చేపట్టారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు జరిపించారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి

బొమ్మలసత్రం: వేడిగాలులు మొదలయ్యాయని, అధిక వేడి గాలులకు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎం అండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణంలో మార్పు కారణంగా వేడి గాలులు అధికంగా వీచే అవకాశాలున్నాయనే నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవటం, చెమట పట్టకపోవటం, శరీర ఉష్ణోగ్రత పెరగటం, పెదవులు ఎండిపోయి నోరు పిడసగట్టుక పోవటం, కలవరింతలు, ఫిట్స్ రావటం, అపస్మారక స్థితికి వెళ్లటం లాంటివి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని చెప్పారు.

'మధ్యాహ్నం'లో నాణ్యతపై రాజీ పడొద్దు

శిరివెళ్ల: మధ్యాహ్న భోజనంలో నాణ్యతపై రాజీ పడొద్దని డీఈఓ అనురాధ తెలిపారు. గురువారం చెన్నూరు ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 9.50 గంటలకే పాఠశాలకు చేరుకొని మధ్యాహ్న భోజనం వరకు తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం వంట చేశారు. అయితే పులిహోర నాణ్యత తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతను మెరుగు పర్చాలని నిర్వాహకులకు సూచించారు. అంతకు ముందు వంట ఆరుబయట చేస్తుండంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గది మరమ్మతు చేస్తున్నారని, దీంతో బయట వంట చేస్తున్నారని హెచ్‌ఎం షణ్ముఖరెడ్డి తెలిపారు. అనంతరం ప్రతి తరగతి గదికి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఆదేశించారు. అలాగే మన బడి నాడు– నేడు పనులను పరిశీలించారు. ఉన్నత పాఠశాలగా మారిస్తే ఇసుకపల్లె, కొట్టాలపల్లె, బీరవోలు, బోయలకుంట్ల గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని హెచ్‌ఎం చెప్పగా..త్వరగా ప్రతి పాదనలు పంపాలని కోరారు.


చెన్నూరు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ

ప్రగతి పథంలో రాష్ట్రం


మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలపడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం సాధించారని శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం చాగలమర్రిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ బాబులాల్ ఆధ్వర్యంలో నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి, వసతులు, ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ సమాజంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక స్వాలంబనకు కట్టుబడి పలు కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. ఇంత అభివృద్ధి సంక్షేమం కనిపిస్తున్నా టీడీపీ నేతలు ఓర్వలేక ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఎంపీపీలు వీరభద్రుడు, గజ్జల రాఘవేంద్రారెడ్డి, అమర్నాథరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, పత్తి నారాయణ, సర్పంచ్ తులసమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

నంద్యాల(అర్బన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలలతో పాటు ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీతో పాటు చెప్పని వాటిని కూడా పేదలకు అందించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.


మహిళా ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

పశువులకు టీకాలు వేయించాలి

గోస్పాడు: పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గోస్పాడు, నెహ్రూనగర్ గ్రామాల్లో టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా టీకాలను అందజేసిందన్నారు. సుమారు 50 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గోస్పాడు వైద్యాధికారి ఉమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

ఉయ్యాలవాడ : పశు పెంపకందారులు పశువులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారిణి నాగశైలజ సూచించారు. గురువారం గాలికుంటు వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎద్దులు, పాడి గేదెలు 210 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ లాల్‌సింగ్‌నాయక్, పశుసంవర్థక శాఖ సహాయకులు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

రుద్రవరం: గ్రామ సచివాల ఉద్యోగులు విధి నిర్వహణలో సమయ పాలన పాటించాలని డీఎల్పీఓ రాంబాబు సూచించారు. మండలంలోని నర్సాపురం గ్రామ సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. సచివాలయ నిర్వాహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం,వీధి దీపాల సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. కార్యదర్శి జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీమా సౌకర్యం కల్పించండి

ఆళ్లగడ్డ: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు, సహాయకులకు ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రం చాగలమర్రిలో తహసీల్దార్ విజయకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు, సహాయకులకు సహజ మరణమైతే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆపరేటర్ల సంఘం నాయకులు మహబూబ్ షరీఫ్, గోపాల్ ఉన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక


ఎంపికైన దాస్

నంద్యాల(సిటీ): అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు అయ్యలూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న వీ.దాస్ ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత నెల 16 నుంచి 18వ తేదీల్లో కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో దాస్ 6వ స్థానంలో నిలిచి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై పాఠశాల పేరు ప్రతిష్ఠలను నిలిపారని కొనియాడారు. త్వరలో ఫిలిప్పీన్స్ దేశంలో జరగనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో దాసు పాల్గొంటాడని చెప్పారు. ఉపాధ్యాయులు దాస్‌ను అభినందించారు.

వాల్మీకులు ఐకమత్యంగా ఉండాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకులు ఐకమత్యంగా ఉన్నప్పుడే గుర్తింపు లభిస్తుందని వాల్మీకి నేత లాలుస్వామి, వీపీహెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయ పులికొండన్న తెలిపారు. స్థానిక తాలూకా పోలీసు స్టేషన్ ఎదుట పాత గార్డెన్ కేఫ్ కాంప్లెక్స్‌లో గురువారం వాల్మీకుల జిల్లా ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు నాగేశ్వరరావు, నారాయణ, పరమూరి శేఖర్, నాగేంద్ర, గోవిందు, మురళీ, లాయర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను డీఎల్‌డీఓ జనార్దన్‌రావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 10, 12, 37వ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి, చెత్త, కుళాయి పన్నుల వసూళ్లలో అలసత్వం చూపరాదన్నారు. మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ వరమద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని దేనియల్‌పురంలో కుళాయిల నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని పిలిపించి కుళాయిలలో కలుషిత నీరు వస్తుండటంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి కాలనీకి వెళ్లి కలుషిత నీరు ఎన్ని రోజుల నుంచి వస్తుందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ నీటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించి, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

యూనిఫాం ధరించాలి

ఉయ్యాలవాడ : సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూనిఫామ్ ధరించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. గురువారం మండలంలోని పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. సచివాలయ ఉద్యోగులు నిర్ణీత సమయంలో కార్యాలయం చేరుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం చిన్నారులకు క్రమం తప్పకుండా అందించాలని కార్యకర్తలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు నూర్‌బాషా, లక్ష్మి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

లెగసీ శుద్ధీకరణ పనులు త్వరగా పూర్తి చేయండి

సాక్షి ఎఫెక్ట్

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతి రోజూ గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి సేకరిస్తున్న చెత్తను డంప్ యార్డులో నిల్వ చేస్తారు. డంప్ యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తను త్వరగా శుద్ధీకరణ చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. గత నెల 28వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'తూతూ మంత్రంగా లెగసీ వేస్ట్ శుద్ధి' అనే వార్తకు ఆయన స్పందించారు. గురువారం డంప్ యార్డును పరిశీలించారు. లెగసీ వేస్ట్‌ను త్వరగా శుద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే డంప్‌యార్డులో మంటలు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, ఎంఈ రమణమూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.


డంప్‌యార్డులో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

హాకీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

నంద్యాల(సిటీ): 11వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హాకీ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి సునీల్ తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీజీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన బాలికలను ఎంపిక చేశామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారుణులు.. శ్రీలత, మమత, శ్రీజ, ఫాతిమా, పావని, లహరి, భార్గవి, ప్రియదర్శిని, మేఘన, స్వాతి, సరోజ, శ్రీలక్ష్మి, భార్గవి, అనిత, రేవతి, జ్ఞానప్రసన్న, జగ్నిత, హంసిక ఎంపికయ్యారని వివరించారు. జిల్లా హాకీ కోచ్ శివ, మేనేజర్ శ్రావణ్ పాల్గొన్నారు.


ఎంపిక పోటీల్లో పాల్గొన్న బాలికలు

ముగిసిన ఆలయ వార్షికోత్సవం


గరుడ వాహనంపై ఊరేగుతున్న పాండురంగడు


ఎమ్మెల్యే శిల్పా రవిని సన్మానించిన దృశ్యం

నంద్యాల(అర్బన్): పాండురంగాపురంలో వెలసిన శ్రీరుక్మిణీ సమేత పాండురంగ, వేణుగోపాల, గణపతి కామేశ్వరి, నందిసమేత కామేశ్వర, అభయాంజనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, వీరభద్ర స్వామి వార్ల ఆలయ 30వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభంగా ముగిశాయి. సాయంత్రం రుక్మిణీ సమేత పాండురంగ స్వామి వార్ల ఉత్సవ మూర్తులు గరుడ వాహనంపై విహరించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించగా నిర్వాహకులు వారిని సత్కరించారు.